



హేచరీలోని రొయ్య పిల్లలతో ఆక్వా సాగుకు తీవ్ర నష్టం

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 70 వేల ఎకరాల్లో ఆక్వా పంటకు నష్టం
- జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ సమీక్షలో మత్స్యశాఖ నిర్ధారణ
- త్వరితగతిన స్పందించాల్సిందిగా మత్స్యశాఖకు కలెక్టర్ ఆదేశాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఆక్వా పరిశ్రమను తెగుళ్ల బెడద వణికిస్తోంది. ఆకస్మికంగా రొయ్యలకు సోకుతున్న తెగుళ్ల వల్ల ఆక్వా చెరువుల్లో పంట మృత్యువాత పడి రైతులకు అపార నష్టాన్ని కలిగిస్తోంది. ఒకవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల ప్రభావంతో రొయ్యల ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంటే, మరోవైపు తెగుళ్ల బారినపడి రైతులకు సంభవిస్తున్న నష్టాలు వారిని కుదేలు చేస్తోంది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల వ్యాప్తంగా సుమారు 70 వేల ఎకరాల ఆక్వా సేద్యానికి తెగుళ్లు సోకి తీవ్రంగా పంట నష్టం వాటిల్లుతోందన్న సమాచారంపై కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ స్పందించి అధికారులతో సమీక్ష చేస్తున్నారు. ముఖ్యంగా ఆక్వా సాగు సమయంలో ఎనోఫర్ సైటోజిన్ హిపట్ పీనీఐ (ఈహెచ్‌పీ) వ్యాధి రొయ్యల పంటపై సోకడం వల్ల ఆక్వా రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ప్రధానంగా ఈ వ్యాధి రొయ్య పిల్లల ఉత్పత్తి హేచరీల నుంచిగానీ, కలుషిత నీటి ద్వారా గానీ సంక్రమిస్తుంది. ఈ వ్యాధి కనుక ఒక్కసారి సోకినట్టయితే మొత్తం చెరువులో రొయ్యలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అటువంటి తెగుళ్లు సోకిన రొయ్యల చెరువుల్లోని నీటిని పూర్తిగా తొలగించాలి. చెరువును బాగా బీటలు వారేలా ఎండబెట్టాలి. తర్వాత కాలుష్యం ఆక్సైడ్ ఫిక్ టైమ్‌లో హెక్టారుకు ఆరు టన్నులు చెరువులో చల్లాలి. తద్వారా అధిక క్షారత్వం వల్ల క్రిమికీటకాలు నశిస్తాయి. దాంతో మళ్లీ ఫ్రెష్‌వాటర్‌తో వారంరోజులు చెరువులో ఉంచి క్షారత్వాన్ని తటస్థీకరణ చేయాలి. అనంతరం ఫ్రెష్ వాటర్‌తో రొయ్య పిల్లను చెరువులో వదలాలి. ఈ వ్యాధి నిర్ధారణ కోసం చెరువులో మేత తొట్టెలను లోపలికి వచ్చే రొయ్య పిల్లలను పరిశీలించినప్పుడు అన్నీ ఒకే సైజులో కాకుండా వేర్వేరు సైజుల్లో ఉంటాయని, దానిని పరిశీలించి రైతులు నిర్ధారణ కోసం పీసీఆర్ పరీక్షలు చేయించాలని కాకినాడ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ అదనపు సంచాలకురాలు ఎస్.అంజలి రైతులకు సూచించారు. అటువంటి పరిస్థితుల్లో ఆక్వా రైతులు దగ్గరలో ఉన్న మత్స్యశాఖ అధికారులను సంప్రదిస్తే వారిచ్చే సూచనలపై ఆక్వా సేద్యానికి సిద్ధం కావాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్ సమీక్ష..

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో వేల ఎకరాల్లో రొయ్య పిల్లలకు సోకుతున్న వ్యాధుల కారణంగా ఆక్వా రైతులు నష్టం జరుగుతున్న పరిణామాలపై కలెక్టర్ మహేష్‌కుమార్ శుక్రవారం అమలాపురంలోని కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా కాకినాడ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్, అదనపు సంచాలకులు ఎస్.అంజలితోపాటు మత్స్యశాఖ జిల్లా అధికారి పీవీ శ్రీనివాసరావు, సహాయ సంచాలకుడు వర్ధన్, పలువురు శాస్త్రవేత్తలు సమావేశంలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 70 వేల ఎకరాల్లో రొయ్యల పిల్లల కారణంగా ఆక్వా సేద్యానికి తెగుళ్లు సోకి తీవ్ర నష్టం కలిగిస్తున్న పరిణామాలపై సమీక్షించారు. రొయ్యల సాగులో నష్టాలను అధిగమించేందుకు లేదా తగ్గించేందుకు గల అవకాశాలపై అధ్యయనం చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులకు సూచించారు. ఈ వ్యాధి నివారణ కోసం జిల్లావ్యాప్తంగా ఆక్వా ల్యాబ్‌లను మరింత బలోపేతం చేయడంతోపాటు రొయ్యల సాగు పట్ల అనుభవం కలిగిన శాస్త్రవేత్తల సలహాలను పరిగణలోనికి తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. మత్స్యశాఖ అధికారులు స్పందించి నష్ట నివారణ చేపట్టాలని ఆదేశించారు.

శాంతిభద్రతలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ రాహుల్ మీనా
- జిల్లా పరిస్థితులపై సమీక్ష



జిల్లా పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతీ పోలీసు అధికారి అప్రమత్తంగా ఉంటూ నిరంతరం ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని ఎస్పీ రాహుల్‌మీనా విజ్ఞప్తి చేశారు. మహిళలకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని శక్తి యాప్ వినియోగం, మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. అమలాపురంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని రాహుల్ మీనా నిర్వహించారు. జిల్లా సరిహద్దు ప్రాంతాలతోపాటు కేసులు ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాల సమాచారం అడిగి తెలుసుకున్నారు. దసరా పండుగ నేపథ్యంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ పోలీసులను ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.



బ్యాంకర్ల రివ్యూ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్


బ్యాంకింగ్ సేవలు అందించడంలో అధికారులతో సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్

అమలాపురం, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి):ఆర్థిక ప్రగతికి బ్యాంకింగ్ సేవలు అందించడంతోపాటు అధికారుల సమన్వయంతో బ్యాంకర్లు కీలక పాత్ర వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో సంప్రదింపుల కమిటీ జిల్లాస్థాయి రివ్యూ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. రుణాల కల్పన లక్ష్యం, పురోగతిపై బ్యాంకర్లతో సమీక్షించారు. రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిగా సహకరించాలని, అన్ని బ్యాంకులకు నిర్దేశించిన ప్రకారం రుణ లక్ష్యాలు, పథకాల ప్రగతిపై బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్షించారు. రెండో త్రైమాసిక సమీక్షలో ఆర్థిక లక్ష్యాలు, క్రెడిట్ ప్రణాళికల అమలుపై ఆరా తీశారు. ఎల్డీఎం గత త్రైమాసిక సమావేశంలో మినిట్స్‌లో తీసుకున్న చర్యలను కలెక్టర్‌కు వివరించారు. బ్యాంకర్లు, అధికారుల మధ్య మరింత సమన్వయం పెరగాలని కలెక్టర్ కోరారు. పీఎం ఉపాధి కల్పన రుణాల మంజూరు ద్వారా క్రెడిట్ సహాయాన్ని పెంచాలని బ్యాంకులకు సూచించారు. జిల్లాలో బ్యాంకు రుణ బకాయిలు కేవలం 2.77గా నమోదైందని కలెక్టర్ వెల్లడించారు. సబ్సిడీ రుణాల ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, కొబ్బరి, మత్స్యకార రంగాల విలువ ఆధారిత పరిశ్రమల స్థాపనకు బ్యాంకర్లు ముందుకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నాబార్డు జిల్లా హోలిస్టిక్ ఇంప్రూవ్‌మెంట్ నిధి బుక్‌లెట్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్డీఎం కేశవవర్మ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రీజనల్ హెచ్ కృష్ణమాచారి, ఆర్బీఐ ఎల్డీవో గిరిధర్, నాబార్డు డీడీఎం స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ సుపరిపాలన అందించాలి..


భూపరిపాలనా, నీటితీరువా వసూళ్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీ అంశాల్లో ఉద్యోగులు అంకిత భావతంతో పనిచేసి ప్రజలకు డిజిటల్ సుపరిపాలన అందించాలని కలెక్టర్ మహేష్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని తహశీల్దార్లు, ఉప తహశీల్దార్లు, రెవెన్యూ ఇనస్పెక్టర్లు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించి పలు అంశాల పురోగతిపై సమీక్షించారు. పలు రెవెన్యూ అంశాలపై కలెక్టర్‌తో సమీక్షించారు. ఈ సమావేశంలో డీఆర్వో కె.మాధవి, ఆర్డీవోలు పి.శ్రీకర్, డి.అఖిల పాల్గొన్నారు.

కొత్త అక్విడెక్టుపై సోలార్ లైట్ల ట్రైల్ రన్


సోలార్ లైట్లు

- రూ.12.16 లక్షల వ్యయంతో సోలార్ లైట్లు
- 36 సోలార్ లైట్లతో వెలుగులు
- రూ.49.37 లక్షలతో అక్విడెక్టుపై రిపేర్లు

పి.గన్నవరం, 19 సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చొరవతో పి.గన్నవరం శ్రీమతి డొక్కా సీతమ్మ అక్విడెక్టుకు సోలార్ సిస్టమ్‌తో కూడిన లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈమేరకు శుక్రవారం రెండు లైట్లు ఏర్పాటుచేసి ట్రైల్ రన్ వేశారు. గతంలో వేసిన విద్యుత్ లైట్లు పట్టుమని పదిరోజులు కూడా వెలగకపోవడంతోపాటు కరెంటు బిల్లుపై పి.గన్నవరం, లంకలగన్నవరం పంచాయతీల అధికారులు మల్లగుల్లాలు పడ్డారు. దీంతో అక్విడెక్టుపై విద్యుత్‌లైట్లు అలంకారప్రాయంగా మారింది. లైట్లు పూర్తిస్థాయిలో కాంతులు రాకుండానే స్తంభాలకు ఉన్న బ్యాటరీలను దొంగలు దోచుకుపోయారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటికీ పట్టించుకోలేదు. గతేడాది వరదల సమయంలో అక్విడెక్టును ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చొరవతో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పరిశీలించారు. అక్విడెక్టు అభివృద్ధి, లైట్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్ సోలార్ లైట్లకు సీఎస్ఆర్ నిధులు రూ.12.16 లక్షలు, అక్విడెక్టుపై జాయింట్ల వద్ద పూర్తిస్థాయిలో మరమ్మతులు, ఫుట్‌పాత్‌పై ప్లేట్స్, అక్విడెక్టుపై పలుచోట్ల శ్లాబ్ రిపేర్లు, సబ్‌డివిజన్ కార్యాలయానికి వెళ్లేచోట సీసీ రోడ్డు తదితర పనుల నిమిత్తం సీఎస్ఆర్ నిధులు రూ.49.37 లక్షలు మంజూరు చేశారు. సోలార్ లైట్లుకు సంబంధించి టెండర్లు పూర్తిచేసుకుని పనులు ప్రారంభించగా అక్విడెక్టు అభివృద్ధికి టెండర్లు పిలిచారు. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తారని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. కాగా పంచాయతీరాజ్ ప్రాజెక్టు అధికారులు ఆధ్వర్యంలో సోలార్ లైట్లు ఏర్పాటు నిమిత్తం ప్రస్తుతం రెండు లైట్లు ఏర్పాటుచేసి ట్రైల్‌రన్ వేశారు. సాయంత్రం ట్రైల్‌రన్‌లో ఉన్న లైట్లను పంచాయతీరాజ్ ఈఈ పి.రామకృష్ణారెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి లైటుకు 60 వాట్స్ సామర్థ్యం కల్గిన బ్యాటరీని ఏర్పాటుచేస్తున్నామని, ఈ లైట్ల పనితీరు బాగుంటే వాటినే ఏర్పాటుచేస్తామని, లేకపోతే 80 వాట్స్ సామర్థ్యం కలిగిన లైట్లు ఏర్పాటుచేస్తామని ఆయన తెలిపారు. అక్విడెక్టు మొత్తం మీద పాత స్తంభాలకే 38 సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.


అమలాపురం మండలం కామనగరువులో వైద్య కళాశాల అసంపూర్తి భవనాల వద్ద వైసీపీ శ్రేణులు ధర్నా చేస్తున్న దృశ్యం

వైద్య కళాశాల అసంపూర్తి భవనాల వద్ద వైసీపీ శ్రేణుల ధర్నా

అమలాపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో మంజూరైన వైద్య కళాశాలలను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనే ఉద్దేశంతో ఉందని ఆరోపిస్తూ వైసీపీ శ్రేణులు అమలాపురం రూరల్ మండలం కామనగరువు-సమనస మధ్య అసంపూర్తిగా ఉన్న వైద్య కళాశాల భవనాల వద్ద ధర్నా నిర్వహించారు. తొలుత ఊరేగింపుగా వెళ్లి వైద్య కళాశాల భవన నిర్మాణాల వద్ద నిరసన వ్యక్తంచేశారు. జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమానికి వైసీపీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మాజీ ఎంపీలు వంగా గీత, చింతా అనురాధ, తోట నరసింహం, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, జిల్లా పరిషత్ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్‌తోపాటు వివిధ ప్రాంతాల పార్టీ నాయకులు పాల్గొన్నారు. వైసీపీ హయాంలో నిర్మించిన భవనాలు మీకు కానరావడం లేదా అంటూ నిరసన తెలిపారు.

కొబ్బరి ఆధారిత పరిశ్రమ ఏర్పాటుచేయాలి

● అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే వరప్రసాద్


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెంలో కోకోనట్ పార్కు ఏర్పాటు చేయడం ద్వారా రైతులను ఆదుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అసెంబ్లీలో శుక్రవారం మాట్లాడారు. రాజోలు ప్రాంతంలో 25వేల ఎకరాల కొబ్బరి పంట విస్తరించి ఉందని, ఏడాదికి సుమారు రూ.300 కోట్ల వ్యాపారం జరుగుతుందన్నారు. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, గుజరాత్, చత్తీస్‌గడ్, ఒడిసా రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతి అవుతుందని తెలిపారు. రాజోలు నియోజకవర్గంలో కొబ్బరి ఆధారిత పరిశ్రమ లేకపోవడంవల్ల ఎగుమతుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి మన ప్రాంత రైతులకు ఉందని, అందువల్ల కొబ్బరికి స్థిరమైన ధర మా ప్రాంతంలో ఉండడం లేదన్నారు. ఒక్కో సందర్భంగా కొబ్బరికాయ రూ.10 కన్నా తక్కువ ధర పలుకుతుందని వాపోయారు. రాజోలు నియోజకవర్గ తూర్పుపాలెంలో కొబ్బరి ఆధారిత పరిశ్రమకు ఎంఎస్ఎంఈ పార్కు నెలకొల్పాలని అందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించామన్నారు. సంబంధిత మంత్రి సమాధానమిస్తూ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

ఆరు వంతెనలు మంజూరు చేయండి

● పవన్‌కల్యాణ్‌ను కోరిన ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌ను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శుక్రవారం అసెంబ్లీలో


డిప్యూటీ సీఎం పవన్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆనందరావు

మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య దృష్ట్యా మారో ఆరు ప్రాంతాల్లో వంతెనల నిర్మాణం చేపట్టడానికి ప్రభుత్వం అనుమతించాలని కోరుతూ ఎమ్మెల్యే ఆనందరావు పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అవసరాలను దృష్టిలో పెట్టుకుని వీటిని మంజూరుచేసి ట్రాఫిక్ సమస్య నిరోధానికి సహకారం అందించాలన్న ఆనందరావు అభ్యర్థనపై పవన్‌కల్యాణ్ సానుకూలంగా స్పందించారు.

వచ్చేనెల నుంచి స్త్రీనిధి రుణాలు ఇంటింటికీ తనిఖీ

మలికిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): డీఆర్డీఏ వెలుగు విభాగం ద్వారా గ్రామాల్లో మహిళలు తీసుకున్న స్త్రీనిధి రుణాలను వచ్చే నెల నుంచి ఇంటింటికీ తనిఖీ చేస్తామని స్త్రీనిధి బ్యాంకు జిల్లా అసిస్టెంట్ మేనేజర్ హేమలత అన్నారు. వెలుగు కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ పలు గ్రామాల్లో స్త్రీనిధి రుణాలు తనిఖీ చేయాలని వచ్చిన విజ్ఞప్తులపై రెండు రోజులుగా తనిఖీ చేసినట్టు తెలిపారు. ఐదుగురు మండలస్థాయి మేనేజర్లతో వెలుగు సిబ్బందినమోదు చేసిన రికార్డులను తనిఖీ చేశారు. ఆ రుణాలు నిజంగా లబ్ధిదారులు పొందారా లేరా తనిఖీ చేస్తామన్నారు.వెలుగు ఏపీఎం సయ్యద్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దివ్వి దుర్గాభవానీ, కోశాధికారి దివ్య పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏడు సంవత్సరాలుగా జీతాలు పెంచకపోవడం, సమ్మెకాలపు ఒప్పందాలు నెరవేర్చకపోవడం, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచకపోవడం తదితర అంశాలపై సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం మండల మానవ వనరుల కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా దశలవారీ ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అక్టోబరు 12న విజయవాడలో దశాబ్ద ఉద్యమం- భవిష్యత్ పోరాటం నినాదంతో మహాసభ నిర్వహించనున్నట్టు నూకపెయ్యి గంగాధర్ ప్రకటించారు. జె.అశోక్‌బాబు, బి.జాన్‌బాబు, ఎం.లలిత, కె.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


గొల్లవిల్లిలో కబడ్డీ ఆడుతున్న సొసైటీ చైర్మన్ ఆకేటి పెద్ద, టీడీపీ బీసీ సెల్ మాజీ చైర్మన్ చప్పిడి వెంకటనాగేశ్వరరావు, రన్నింగ్‌లో పాల్గొన్న విద్యార్థి

విద్యార్థులతో సమానంగా పెద్దల కబడ్డీ

● రిఫరీగా ఆక్వా కల్చర్ డవలెప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు క్రీడల్లో తమ ప్రతిభ కనబరిచేందుకు ఆసక్తి చూపించారు. భీమనపల్లి సొసైటీ చైర్మన్ ఆకేటి పెద్ద, మండల టీడీపీ బీసీ సెల్ మాజీ చైర్మన్ చప్పిడి వెంకటనాగేశ్వరరావు కబడ్డీలో తలపడ్డారు. ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ రిఫరీగా వ్యవహరించారు. ఈ పోటీ విద్యార్థులను ఆకట్టుకుంది.

క్రీడాకారుల ఎంపికలో ప్రమాణాలు పాటించాలి

క్రీడల నిర్వహణ, క్రీడాకారుల ఎంపికలో ఉత్తమ ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ వ్యాయామోపాధ్యాయులకు సూచించారు. గొల్లవిల్లి హైస్కూల్ క్రీడాప్రాంగణంలో శుక్రవారం మండల ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్, క్రీడా పోటీలు నిర్వహించారు. హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ ఆధ్వర్యంలో పీఎంసీ చైర్మన్ వోలా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్రీడలను నిర్వహించి, క్రీడాకారులను నియోజకవర్గ పోటీలకు ఎంపిక చేశారు. వాలీబాల్‌లో గొల్లవిల్లి విన్నర్స్, భీమనపల్లి రన్నర్స్‌గా నిలిచాయి. కబడ్డీలో భీమనపల్లి విన్నర్స్‌గా నిలిచింది. కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గా చిన్నా, ఎంఈవోలు నూకల సత్యనారాయణ, సత్తి సత్యకృష్ణ, అరిగెల నరేష్, గుత్తాల సుభాష్‌చంద్రరావు, సలాది నాగరాజు, వ్యాయామోపాధ్యాయులు గొలకోటి ఫణీంద్రకుమార్, కామన మధు, సరస్వతి, స్వాతి, ప్రసాద్, సీతాపతి, విజయభాస్కర్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

అయినవిల్లి(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలను మండల విద్యాశాఖాధికారి పెచ్చెట్టి శ్రీనివాస్ శుక్రవారం ప్రారంభించారు. పాఠశాల హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యాశాఖాధికారి శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. మండల స్థాయిలో బాలురకు వాలీబాల్, కబడ్డీ, కోకో, చెస్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైనవారు కొత్తపేటలో జరిగే డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు, చింతనలంక పాఠశాల హెచ్ఎం పి.పల్లయ్యశర్మ, నేరేడుమిల్లి సత్యనారాయణ, నెల్లి మేరీగ్రేస్, మండల విద్యాశాఖాధికారి పెచ్చెట్టి శ్రీనివాస్‌లను మండల వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ యడ్ల లక్ష్మీదుర్గ, జిల్లా వ్యాయామ సంఘ కోశాధికారి ఎంజీ రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.రమేష్, సీహెచ్ సత్యానందం పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు క్రీడలలో పాల్గొనడం ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావులు అన్నారు. అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 9 పాఠశాలలు, ప్రవేట్‌పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, నాయకులు నాగాబత్తుల వెంకటసుబ్బారావు, కొర్లపాటి వెంకటేశ్వరరావు, బండారు అమ్మాజీ, హెచ్ఎం, పీడీలు పాల్గొన్నారు.


అంబాజీపేటలో పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరావు, కేశవదాసుపాలెంలో ప్రారంభిస్తున్న ఎంపీపీ మల్లిబాబు

అంతర్వేది(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెంలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలను ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఎం.సరోజ, ఎంఈవో వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మండలస్థాయిలో 250 మంది విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. అథ్లెటిక్స్, చెస్, యోగా పోటీలు నిర్వహించి విజేతలకు విద్యాకమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు పతకాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉండపల్లి అంజి, ఎస్ఎంసీ చైర్మన్ కుంచే గంగాచలం, హెచ్ఎం టీవీఎల్ సత్యవతి, పీడీలు పాల్గొన్నారు.

స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భీమనపల్లి పీహెచ్‌సీ వద్ద శుక్రవారం వైద్యాధికారిణి సీహెచ్ విష్ణుప్రియ స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో గర్భవతులు, కిశోరబాలికలు, బాలింతలకు ప్రత్యేక వైద్య సేవలందించారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. ప్రతి సచివాలయ పరిధిలోనూ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆక్వా అథారిటీ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రాము, జనసేన నాయకుడు గొలకోటి తాతాజీ, ఎంపీహెచ్ఈవో రాయుడు రామకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు పంచాయతీ పల్లిపాలెంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన గోడిలంక పీహెచ్‌సీల ఆధ్వర్యంలో స్వస్తినారీ సశక్త్ పరివార్ అభియాన్ సదస్సు శుక్రవారం జరిగింది. గోడిలంక పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ స్పందన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో ప్రతీఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, ఓలేటి పరమేశ్వరరావు, జడ్పీటీసీ దొమ్మేటి శ్రీశాంతిభవానీ, కార్యదర్శి పి.ఆదిశంకరం, డి.బాబ్జి, సూపర్‌వైజర్లు సూర్యనారాయణ, పద్మ, సౌమ్య, విజయకుమారి, ఏఎన్ఎంలు ఉమా, బేబిదుర్గపాల్గొన్నారు.

మహిళా ఆరోగ్యం ద్వారానే కుటుంబ ఆరోగ్యం

ముమ్మిడివరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన మహిళల వల్ల బలమైన కుటుంబం ఏర్పడి తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కౌన్సిలర్లు ములపర్తి బాలకృష్ణ, యూపీహెచ్‌సీ వైద్యులు డి.వెంకటేష్ పేర్కొన్నారు. స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం 5, 8 వార్డులకు సంబంధించి యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని ములపర్తి బాలకృష్ణ, కట్టా సత్తిబాబు ప్రారంభించగా వైద్యులు డి.వెంకటేష్ వంది మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బి.సంపూర్ణ, ఎన్వీవీ సత్యనారాయణ, ఎం.మీరాసాహెబ్, పి.మహేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మహిళల్లో వచ్చే వ్యాధులపై అవగాహన

మామిడికుదురు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళల్లో వచ్చే వివిధ రకాల వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం మామిడికుదురు పంచాయతీ వద్ద నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి అవగాహన కల్పించారు. మహిళల్లో వచ్చే క్యాన్సర్ వ్యాధిని గుర్తించడం వల్ల దానిని నివారించే ఆస్కారం ఉందని తెలిపారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు పౌష్టికాహారాన్ని తెలియచేసే స్టాల్‌ను ఏర్పాటుచేశారు. నగరం సొసైటీ చైర్మన్ ఈలి శ్రీనివాస్, నాయకులు మెండా ఆదినారాయణ, త్రిలోచనరావు పాల్గొన్నారు.

డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలి

రాజోలు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఎస్టీపీ రాఘవకుమార్ శుక్రవారం రాజోలు ఆర్టీసీ డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికుల వసతులు, టాయిలెట్లు, తాగునీరు, పరిసరాల శుభ్రత, సమాచార కేంద్రం వంటి సదుపాయాలను ఆయన స్వయంగా సమీక్షించారు. బస్సుల కండీషన్‌ను పరిశీలించారు. అనంతరం ఏపీఎస్ ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్ల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డిపో అభివృద్ధి కోసం పలు సూచనలు చేశారు. స్త్రీశక్తి పథకం అమలులో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. బస్సులో ప్రయాణించే ప్రయాణికులతో డ్రైవర్లు, కండక్టర్లు మర్యాద పూర్వకంగా తమ విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా రాజోలు డిపో మేనేజర్ జి.జేమ్స్‌కుమార్ మాట్లాడుతూ డిపోలో తాగునీరు, టాయిలెట్లు, బస్ సర్వీసుల ఎంక్వైరీ, పరిసరాల పరిశుభ్రత వంటి సదుపాయాలు ప్రయాణికులకు అందిస్తున్నామన్నారు. ఎస్టీఐ కేకే దొర, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడిగా చంద్రశేఖర్

అంబాజీపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా జాతీయ బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడిగా గంగలకుర్రు అగ్రహారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మట్టపర్తి చంద్రశేఖర్‌ను నియమించినట్లు జాతీయ అధ్యక్షుడు వీరవెల్లి శ్రీనివాస్ ప్రకటించారు. గంగలకుర్రు అగ్రహారంలో బీసీ సంఘాల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి బీసీ 139 కులాల అభివృద్ధి కోసం జనగణనలో కులగణన ఖచ్చితంగా జరగలన్నారు. జనగణన ప్రకారం బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కావాలన్నారు. బీసీలకు రక్షణ చట్టం కావాలన్నారు. స్థానిక ఎన్నికలలో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. బీసీ చైతన్యవేదిక రాష్ట్ర కార్యవర్గ ఉపాధ్యక్షులు మట్టపర్తి సూర్యచంద్రరావు, రాష్ట్ర బీసీ చైతన్య వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి రాయుడు లక్ష్మణరావు, రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు మట్టపర్తి మురళీకృష్ణ, గౌరీశంకర్, శ్రీను పాల్గొన్నారు.

పలు ఆలయాల్లో మల్లాడి ప్రత్యేక పూజలు

యానాం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలోని వినాయక చవితి నవరాత్రిమహోత్సవాలలో భాగంగా నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొన్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పూజలు నిర్వహించారు. బాలయోగినగర్, అబ్దుల్‌కలాంనగర్, గిరియాంపేటల్లో అన్నసమారాధనలు మల్లాడి ప్రారంభించారు. నిర్వాహకులు మల్లాడిని ఘనంగా సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం విద్యుత్‌సబ్‌స్టేషన్ 33-11 కెవి పరిధిలో మరమ్మతులు నిమిత్తం శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. పి.గన్నవరం, లంకలగన్నవరం, నాగుల్లంక, మానేపల్లి, వాడ్రేవుపల్లి, ముంగండ, ఆర్.ఏనుగుపల్లి, కె.ఏనుగుపల్లి, వై.కొత్తపల్లి, కె.ముంజవరం, ముంజవరపుకొట్టు గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అలాగే నరేంద్రపురం సబ్‌స్టేషన్ల పరిధిలో 33-11 కెవి లైన్లలో మరమ్మతులు నిమిత్తం శనివారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఆయన తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న నరేంద్రపురం, కుందాలపల్లి, జి.పెదపూడి, రాజులపాలెం, వైవిపాలెం, ఉడిమూడి, బెల్లంపూడి తదితర ప్రాంతాలలో వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఉప్పలగుప్తంలో ...

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీన ఉప్పలగుప్తం, టి.చల్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో 11కేవీ ఫీడర్ లైన్స్ ట్రీ ట్రిమ్మింగ్, మరమ్మతులు నిర్వహిస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్ కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఈ కారణంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.


నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా

ముమ్మిడివరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేష్, కాకి రాంబాబు, పలివెల ప్రసాద్, బుంగ లక్ష్మణ్, దొండపాటి సతీష్, నిమ్మకాయల మహాలక్ష్మి, బొమ్మి రమణ, మాణిక్యం, గంగలతో పాటు పలువురు పాల్గొన్నారు.

చెయ్యేరు లైన్‌మెన్‌పై సస్పెన్షన్ వేటు

కాట్రేనికోన, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో విద్యుత్ లైన్‌మెన్‌ను సస్పెండ్ చేసినట్టు అమలాపురం ట్రాన్స్ కో ఈఈ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల నుంచి కరెంటు బిల్లు సొమ్ములు వసూలు చేసి డిపార్టుమెంటుకు జమచేయలేదని అతనిపై ఆరోపణలు రావడంతో అమలాపురం, ముమ్మిడివరం ట్రాన్స్ కో అధికారులు దర్యాప్తు నిర్వహించారు. ఆరోపణలు నిర్ధారణ కావడంతో అతనిని సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

సీపీఐ జాతీయ సభలకు రాజేంద్రప్రసాద్



మలికిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మహాసభకు అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ ఎంపికయ్యారు. సెప్టెంబరు 21 నుంచి 25 వరకు చండీఘర్‌లో జరుగు జాతీయ మహాసభల్లో పాల్గొనున్నట్టు తెలిపారు. జాతీయ అంతర్జాతీయ పరిణామాలపైనా, పార్టీ నిర్మాణం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపైనా, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై ఈ సభల్లో చర్చించనున్నట్టు తెలిపారు.

నిరక్షరాస్యులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలి

అంబాజీపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి వారికి అర్థమయ్యే రీతిలో బోధించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అక్షరాంధ్ర కార్యక్రమంలో(ఉల్లాస్) భాగంగా ఎంపీడీవో బి.మమత అధ్యక్షతన వలంటరీ టీచర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడల్ట్ ఎడ్యుకేషన్ జిల్లా అధికారి జి.విజయభాస్కర్ మాట్లాడుతూ చదువురాని పురుషులకు చదువు నేర్పడం కోసం 46 మంది వలంటరీ టీచర్లుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఏపీవో అడపా వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని అస్త్రం కషాయంతో తెగుళ్ల నివారణ

మామిడికుదురు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అగ్ని అస్త్రం కషాయం వల్ల వరి పంటలో తెగుళ్ల సమర్థవంతంగా నివారిస్తాయని మండల వ్యవసాయాధికారి ఎన్వీవీ సత్యనారాయణ తెలిపారు. మామిడికుదురులో శుక్రవారం వరి పంటపై ఆశించిన కాండం తొలుచు పురుగు నివారణకు అగ్ని అస్త్రం కషాయాన్ని డ్రోన్ ద్వారా పిచికారీ చేశారు. నయినాల శ్రీరంగనాథం కంపార్టు బ్లాక్‌లోని పది ఎకరాల్లో 30 లీటర్ల ద్రావణాన్ని పిచికారీచేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంటీ జె.నాగమణి, వీఏఏలు బి.చంద్రశేఖర్, బి.బాబాయ్, పి.గోవిందరాజు, పి.వినయ్, యూనిట్ ఇన్‌చార్జి కుడుపూడి జానకీ, చెల్లుబోయిన రాధ తదితరులు పాల్గొన్నారు.

కొమానపల్లి జడ్పీహెచ్ఎస్‌లో స్వచ్ఛత పక్వాడ్

ముమ్మిడివరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొమానపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, పాఠశాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవోలు టి.గౌరీశంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విత్తనాల శ్రీనివాసరావు, ఎస్.రాంబాబు, కేఎస్వీ త్రిమూర్తులు, ఎస్ఎన్ మునేశ్వరరావు, ఆర్.నాగార్జున, ఎన్‌డీవీవీ ప్రసాద్, సాధనాల శ్రీనివాసరావు, పి.సత్యనారాయణమ్మ, పి.వికాశిని, ఎస్.శ్రీనివాసరావు, పీటీవీవీ వర్మ, నాగలక్ష్మిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

బండరాళ్లతో అలలకు అడ్డుకట్ట



కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌రోడ్డు సుబ్బంపేటలో బండరాళ్లతో చేపట్టిన తాత్కాలిక మరమ్మత్తులు



కొత్తపట్నం-సుబ్బంపేటవద్ద రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికుడు

- ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు
- గోతులుగా ఉన్న రహదారికి మరమ్మతుల మాటేంటి?

కొత్తపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్‌రోడ్డులో ఆర్‌అండ్‌బీశాఖఆధ్వర్యంలో కొత్తపట్నం-సుబ్బంపేట గ్రామాల మధ్య అలలకు బండరాళ్లతో అడ్డుకట్ట ఏర్పాటు చేశారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సముద్రం ఉప్పొంగి రాకాసిఅలలు ఎగసిపడడంతో కొత్తపట్నం-సుబ్బంపేటవద్ద బీచ్‌రోడ్డును ఆనుకుని గతంలో ఏర్పాటు చేసిన రక్షణ గట్టు పైనుంచి మత్స్యకారుల ఇళ్లల్లోకి కెరటాలు దూసుకుపోవడం, బీచ్‌రోడ్డు కోతకు గురవడం తెలిసిందే. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న పిఠాపురం ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులతో కోతకు గురైన బీచ్‌రోడ్డు, సముద్రపునీటిలో మునిగిన మత్స్యకార ఇళ్లను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎంకు సమాచారం తెలియజేయడంతో కొత్తపట్నం, సుబ్బంపేట మధ్య బండరాళ్లు డంప్ చేసి అలలకు అడ్డుకట్ట వేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆయన ఆదేశించారు. దీంతో రెండురోజులుగా బండరాళ్లను డంప్ చేసి కెరటాల ధాటికి అడ్డుకట్ట వేశారు. అలల ధాటికి గోతులుగా మారిన బీచ్‌రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టకపోవడంతో బైక్‌లపై ప్రయాణించే వ్యక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరగా మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

కార్తీకమాస ఏర్పాట్ల పురోగతిపై అన్నవరం ఈవో సమీక్షా సమావేశం



కార్తీకమాస ఏర్పాట్ల రివైజ్డ్ సమావేశంలో పాల్గొన్న ఈవో, దేవస్థానం సిబ్బంది

అన్నవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 22నుంచి కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలకు సంబంధించి ఈనెల 5న ఈవో, చైర్మన్ సమక్షంలో ప్రవేశపెట్టిన మినిట్స్ పురోగతిపై శుక్రవారం ఈవో వీర్ల సుబ్బారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా పర్వదినాల్లో భక్తులు లక్షమందికిపైగా విచ్చేస్తారని అంచనా వేస్తుండగా వారికి ఎక్కడా అసౌకర్యంకలగకుండా ఒంటిగంట నుంచి వ్రతాలు, 2గంటలనుంచి సర్వదర్శనాలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్తీకమాసంలో ప్రధాన ఉత్సవాలైన గిరిప్రదక్షణ, స్వామివారి తెప్పోత్సవం తదితర వాటిపై చర్చించి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. దేవస్థానం సిబ్బందితోపాటు సేవాసంస్థల సభ్యుల సేవలను వినియోగించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. త్వరలో రెవెన్యూ, పోలీస్, ఇతరశాఖల అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ తేదీ నిర్ణయిస్తామని అప్పటికి విభాగ అధిపతులు తమకు నిర్దేశించినలక్ష్యాల్లో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏఈవోలు, సూపరెంటెండెంట్‌లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు సమక్షంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ టీడీపీలో చేరిక



ఎమ్మెల్సీ పద్మశ్రీకి కండువా వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సీఎం చంద్రబాబు

కాకినాడసిటీ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సమక్షంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ శుక్రవారం టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబును ఆమె కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ మేరకు పద్మశ్రీ విడుదల చేసిన ఒక ప్రకటనలో వైసీపీకి రాజీనామా చేసి ఏడాది అయ్యిందన్నారు. పదవిలో ఉన్నా ప్రజలకు పెద్దగా ఏమీ చేయలేకపోయామన్నారు. వైసీపీలో తనకు కనీసం మీడియాతో మాట్లాడే అవకాశం లేకుండా పోయిందన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ పేరాబత్తుల

- తొలిసారిగా శాసనమండలిలో అడుగుపెట్టిన సందర్భంగా ధన్యవాదాలు తెలిపిన రాజశేఖరం



చంద్రబాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు చెబుతున్న ఎమ్మెల్సీ పేరాబత్తుల

కాకినాడసిటీ,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా గెలుపొందిన తర్వాత తొలిసారిగా శాసన మండలిలో అడుగుపెట్టిన పేరాబత్తుల రాజశేఖరం శుక్రవారం సీఎం చంద్రబాబును ఉండవల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 30ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని సీఎంకు ధన్యవాదాలు తెలిపారు.

అన్నవరంలో వివిధ లైసెన్స్ హక్కులకు బహిరంగ వేలం

తగ్గిన టోల్‌గేట్ వసూలు లైసెన్స్ హక్కు వేలం

అన్నవరం,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో వ్యాపార లైసెన్స్ హక్కులకు శుక్రవారం నిర్వహించిన బహిరంగ వేలం హోరాహోరీగా జరిగింది. పాత బుకింగ్ కౌంటర్ ఎదురుగా షాపింగ్‌కాంప్లెక్స్ ఒకటో నెంబరుకు గతంలోఏడాదికి రూ.81.84లక్షలుకాగా ఈఏడాది రూ.1.20కోట్లకు హెచ్చుపాట దక్కించుకున్నారు. షాపునెంబరు రెండుకు గతంలో రూ.43.56లక్షలుండగా తాజావేలంలో రూ.85.44లక్షలు, షాపు నెంబరు నాలుగుకు గతంలో రూ.43.56 లక్షలు ఆదాయం రాగా ఈఏడాది రెట్టింపు మొత్తంతో రూ.85.44లక్షలు సమకూరింది. 6వనెంబరు షాపునకు గతంలో రూ.25.80 లక్షలుండగా తాజా వేలంలో రూ.42.48లక్షలకు హెచ్చుపాటలు వచ్చాయి. జ్యూస్‌పాయింట్ నిర్వహణకు స్వల్పంగానే ఆదాయం పెరిగింది. గతంలో రూ.25.08 లక్షలు ఈఏడాది రూ.25.32లక్షలకు దక్కించుకున్నారు. రత్నగిరికి వచ్చే నాలుగు, ఆరుచక్రాల వాహనాలనుంచి టోల్‌వసూలు లైసెన్స్ హక్కుకు గతంలో రూ.2.27కోట్లు ఆదాయం లభించగా రెండుసార్లు టెండర్లు పిలిచినా అంతమొత్తం చెల్లించేందుకు ఎవరూరాలేదు. దీంతో మూడోసారి నిర్వహించిన వేలంలో అత్యధికంగా రూ.1.98 కోట్లకు టెండరుదారులు మొగ్గుచూపారు. కాలపరిమితి ముగియనుండడం, రాబోయే కార్తీకమాసం దృష్టిలో ఉంచుకుని ఈ వేలాన్ని ఖరారు చేయాలని అధికారులు నిర్ణయించారు.

కోనసీమ జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యురాలిగా రజనీ



పుణ్యమంతుల రజనీ

అమలాపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ జిల్లా కమిటీ సభ్యురాలిగా భట్నవిల్లి గ్రామానికి చెందిన పుణ్యమంతుల రజనీని నియమించారు. మాతా రమాభాయి అంబేడ్కర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్‌గా ఉన్న రజనీని జిల్లా కమిటీ సభ్యురాలిగా నియమిస్తూ కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంతో నమ్మకంతో పదవిని అప్పగించిన కలెక్టర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌వాదులు ఆమెకు అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు శివకోడు హైస్కూలు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శివకోడు హైస్కూలు విద్యార్థులతో హెచ్‌ఎం శ్రీనివాస్

రాజోలు, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూలుగేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా మోరి జడ్పీఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో శివకోడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాల విద్యార్థులు అండర్-17 విభాగం నుంచి పైడిమర్రి ఇంద్రజ, అండర్-14 విభాగంలో బాలం ప్రణతి, వీరమల్లు చిరుతేజ ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉంద్రు సూర్యారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ అభినందించారు.

ఉమ్మడి జిల్లా అండర్-19 కాలేజీ గేమ్స్ జూడో పోటీలకు 16మంది ఎంపిక



జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

జగ్గంపేట,సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి):జగ్గంపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాలేజీ గేమ్స్ జూడో పోటీలకు కళాశాల ప్రిన్సిపాల్ వేమగిరి శ్రీనివాసరావుఅధ్యక్షతన ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాలేజీ గేమ్స్ సెక్రటరీ వెంకటరెడ్డి పాల్గొన్నారు. దీనికి రిఫరీగా జూడో మాస్టర్ తాండ్రోతు వీరవెంకటరమణ వ్యవహరించారు. ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా జూడో పోటీలకు ఎంపికైన 8మంది బాలురు,8మంది బాలికలు రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొంటారని రిఫరీ వెంకటరమణ తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కాలేజీ గేమ్స్ జూడో పోటీలకు ఎంపిక కార్యక్రమం జగ్గంపేట జూనియర్ కాలేజీలో నిర్వహించామని,ఎంపికైన వారంతా రాష్ట్రస్థాయిలో జూడోపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రిఫరీ సాయి కృష్ణ, దేవి కృష్ణ, లెక్చలర్స్ షేక్ మదీనా, సీహెచ్ రాము పాల్గొన్నారు.

ఇదిగో భోజనానికి వచ్చేస్తున్నా.. అన్న పావుగంటకే కబళించిన మృత్యువు

- టీవీఎస్ ఎక్స్‌ఎల్‌ను ఢీకొన్న స్పోర్ట్స్ బైక్
- వ్యక్తి మృతి
- తొండంగిలో ఘటన

తొండంగి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కుమారుడు నిర్వహిస్తున్న షాపు తెరిచేందుకు వెళ్లిన వ్యక్తి మధ్యాహ్నం భోజనానికి వస్తున్నానని కుమారుడికి ఫోన్ చేసి చెప్పిన పావుగంటకే మృత్యువాతపడిన సంఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు సుబ్బరాయపురం వద్ద శుక్రవారం టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్‌సైకిల్‌ను స్పోర్ట్స్ బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. తొండంగి మండలం రావికంపాడు గ్రామానికి చెందిన చిత్రాడ రాజు(50) బెండపూడి శివారు సుబ్బరాయపురంలో తన కుమారుడు తాతాజీ నడుపుతున్న పాతసామాను షాపు తెరిచేందుకు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై ఉదయం 6గంటలకు వెళ్లాడు. మధ్యాహ్నం 12గంటలకు షాపు కట్టేసి ఇంటికి భోజనానికి వస్తున్నానని కుమారుడికి ఫోన్‌చేసి చెప్పాడు. మరో పావుగంటలో ఇంటికి వస్తాడనుకుంటుండగా.. టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటార్‌సైకిల్‌పై రావికంపాడు వెళ్తున్న రాజును బెండపూడినుంచి అన్నవరం వైపు వస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయా స్పోర్ట్స్ బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో రాజు కాలువిరిగి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలిసి కుమారుడు కాసేపు అచేతనుడయ్యాడు. స్థానికులు క్షతగాత్రుడిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుని కుమారుడు తాతాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యానాం బాడీ బిల్డింగ్ సభ్యులతో స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ పెండెం

రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు పయనం

యానాం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భీమవరంలో ఈనెల 21వతేదీ నుంచి జరగనున్న 21వ రాష్ట్రస్థాయి ఓపెన్ లెవెల్ బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు యానాం బాడీ బిల్డింగ్ సభ్యులు వెళ్లనున్నారు. న్యూ ఆంధ్రా బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఖాసీ ఆధ్వర్యంలో మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తామని యానాం బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాళ్ల జీవన్ ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా యానాం మాజీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, పీడీ గుత్తుల మల్లేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ యానాంలో ఉన్న జిమ్‌లను ఉపయోగించుకుని బాడీ బిల్డర్లుగా మంచి ప్రతిభ కనబరచాలని కోరారు.

బారులు తీరిన ఆటోలు

- వాకలపూడి ఏడీబీ రోడ్డులో వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌లో ఆటోల కండిషన్ బ్రేక్ చేయించుకునేందుకు క్యూ
- వాహన మిత్ర పథకం దరఖాస్తుకు చివరి తేదీ కావడంతో హడావుడి



ఏడీబీ రోడ్డులో వెహికల్ టెస్టింగ్ స్టేషన్ వద్ద బారులు తీరిన ఆటోలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ వాకలపూడి ఏడీబీరోడ్డులో ఆటోలు బారులు తీరాయి. ఆటోమేటెడ్ వెహికల్ ఫిట్‌నెస్ టెస్టింగ్ స్టేషన్‌లో ఆటోలకండిషన్ బ్రేక్ చేయించుకునేందుకు రెండురోజులుగా జిల్లా నలుమూలల నుంచి ఆటోడ్రైవర్లు తమ ఆటోలను ఇక్కడకు తీసుకువచ్చారు. వాహన మిత్ర పథకానికి సంబంధించి బుధవారంనుంచి సచివాలయాల్లో ఆటోడ్రైవర్ల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సొంతంగా ఆటో, మోటారు, మేక్సీ క్యాబ్ నడుపుతూ జీవనోపాధి పొందుతున్న వారికి ఈ పథకం వర్తిస్తోంది. దరఖాస్తులకు ఆఖరుతేదీ ఈనెల 19వతేదీ శుక్రవారం కావడం, ఈనెల 24న తుది జాబితా విడుదల చేయడం, అక్టోబరు 1న అర్హత సాధించిన ఆటోడ్రైవర్ల బ్యాంకు ఖాతాలో రూ.15వేలు జమచేయనున్న నేపథ్యంలో ఆటోడ్రైవర్లు తమ ఆటోలు, వాహనాలకు బ్రేక్, ఫిట్‌నెస్ చేయించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి వాకలపూడి ఏటీసీ సెంటర్‌కు అధికసంఖ్యలో తరలివచ్చారు.

సర్వర్ పనిచేయక జాప్యం

రెండురోజులుగా ఆటోమేటిక్ వెహికల్ ఫిట్‌నెస్ సెంటర్(ఏటీసీ) వద్ద ఆటోలతో కిక్కిరిసిపోయింది. దీంతో పరిసర ప్రాంతాలతోపాటు ఏడీబీ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ చేయించుకునే సమయంలో క్యూ పద్ధతి లేకపోవడం, ఆటోలన్నీ ఒకేసారి రావడంతో ఏటీసీ సెంటర్ సెక్యూరిటీ, ఆటోడ్రైవర్ల మధ్య వాగ్వాదం జరిగింది. సర్వర్ సరిగా పనిచేయకపోవడంతో ఫిట్‌నెస్ స్టేషన్‌లో జాప్యం జరిగిందని, దరఖాస్తుల స్వీకరణకు గడుపు పెంచాలని ఆటోడ్రైవర్లు కోరుతున్నారు. ట్రాఫిక్ స్తంభించడంతో తిమ్మాపురం ఎస్‌ఐ గణేష్‌కుమార్ సిబ్బందితో వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.



స్మార్త రత్న అవార్డు అందుకుంటున్న వలబోజుల రాకేష్

యువకుడికి స్మార్త రత్న అవార్డు

చింతూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చింతూరుకు చెందిన యువకుడు వలబోజుల రాకేష్‌శర్మ స్మార్తరత్న అవార్డు అందుకున్నారు. తమిళనాడు కేంద్రంగా ఉన్న అంతర్జాతీయ హిందూ దేవాలయాలు ఆధ్యాత్మిక జ్యోతిషుల సంక్షేమ ట్రస్ట్ వారు అంతర్జాతీయ ఆరో ఆధ్యాత్మిక జ్యోతిష సదస్సును తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు వేదపండితులు పాల్గొన్నారు. మన రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరుకు చెందిన యువకుడు వలబోజుల రాకేష్‌శర్మకు స్మార్తరత్న అవార్డు దక్కింది. అవార్డు ఎంపిక తెలంగాణ కేంద్రంగా నిర్వహించిన నేపథ్యంలో రాకేష్‌కు అంతర్జాతీయ హిందూ దేవాలయాలు, ఆధ్యాత్మిక జ్యోతిషుల సంక్షేమ ట్రస్ట్ తెలంగాణ ఐకానిక్-2025 పేరిట అవార్డును వేదపండితుల సమక్షంలో నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో అత్తలూరి బాలశంకరశాస్త్రి, డోనోజు పరిపూర్ణాచార్యులు, డాక్టర్ విశ్వనాధాచారి పాల్గొన్నారు.

న్యూఢిల్లీ సైనిక్ క్యాంపులో అమలాపురం యువకుడు



జావేద్ హుస్సేన్‌ను అభినందిస్తున్న సుబ్బరాజు తదితరులు

అమలాపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఎన్‌సీసీ క్యాడెట్ న్యూఢిల్లీలోని సైనిక్ క్యాంపులో పాల్గొనడం ఒక కల అని అమలాపురం ఎస్కేబీఆర్ ప్రిన్సిపాల్ వడలి సుబ్బారావు అన్నారు. అటువంటి క్యాంపులో తమ కళాశాల విద్యార్థి జావేద్ హుస్సేన్ పాల్గొనడం అభినందనీయమన్నారు. కాకినాడ ఎన్‌సీసీ గ్రూపు నుంచి అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల ఆర్మీ క్యాడెట్ జావేద్ హుస్సేన్ పాల్గొని సైనిక్ క్యాంపు నుంచి శుక్రవారం కళాశాలకు రాగా ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఏటా ఇండియన్ ఆర్మీలోను, నేవీలోను ఉద్యోగాలు సాధిస్తుంటారన్నారు. ఇటీవల ఎన్‌సీసీ-సి సర్టిఫికెట్ సాధించిన ఇద్దరు క్యాడెట్లు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్‌కు ఎంపికైనట్టు తెలిపారు. జావేద్ హుస్సేన్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, డీఎస్‌ఎన్ రాజు, పరిపాలనాధికారి ఎ.వెంకటపతిరాజు అభినందించారు.

అంతర్వేది ఆలయానికి చాగంటికి ఆహ్వానం



చాగంటికి స్వామి చిత్రపటాన్ని అందిస్తున్న ఏసీ వరప్రసాద్

అంతర్వేది, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రవచనకార్యక్రమం నిర్వహించాలని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ శుక్రవారం చాగంటి కోటేశ్వరరావును స్వయంగా కలిసి ఆహ్వానించారు. వచ్చేఏడాది జనవరిలో సంక్రాంతి అనంతరం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం ఉంటుందని ఏసీ ప్రసాద్ తెలిపారు. ఆలయ ప్రధానార్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, స్థానాచార్యుల వింజమూరి రంగాచార్యులుతో కలిసి చాగంటిని ప్రత్యేకంగా జేసీ ప్రసాద్ ఆహ్వానించారు.

22 నుంచి దసరా వేడుకలు

అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 22వతేదీ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి అక్టోబరు 2 వరకు దశమి వరకు రాజ్యలక్ష్మితాయారమ్మవారు, అశ్వరూడాంబిక ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తారని ఆలయ సహాయ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. పదిరోజులపాటు పూజలు జరుగుతాయని, 2వ తేదీ రాత్రి 7.30 గంటలకు స్వామికి గజవాహనంపైగ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. గుర్రాలక్కమ్మ ఆలయంలో సామూహిక ఉచిత కుంకుమ పూజలను నిర్వహిస్తామన్నారు.

ఆకొండి సేవలకు గుర్తింపుగా ఉత్తమ పురస్కారం

కాట్రేనికోన, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్రకళారంగంలో పదేళ్లుగా కాట్రేనికోనకు చెందిన అంజి ఆకొండి సేవలకు గుర్తింపుగా మేఘాలయ రాష్ట్రంలో ప్రజాడైరీ మాసపత్రిక వార్షికోత్సవంలో ఉత్తమ పురస్కారం లభించింది. మేఘాలయ రాజ్‌భవన్‌లో గవర్నర్ విజయశంకర్ ఈ పురస్కారాన్ని అందించారు. పురస్కారాలు అందుకున్న వారిలో నటుడు రాజేంద్రప్రసాద్, చిత్రకళారంగంనుంచి కళాసాగర్ ఎల్లపు ఉన్నారు. ప్రజాడైరీ వ్యవస్థాపకుడు సురేష్ పాల్గొన్నారు.



మేఘాలయ గవర్నర్ విజయ శంకర్ నుంచి పురస్కారం అందుకుంటున్న అంజి ఆకొండి



గౌరీకుమారిని సన్మానిస్తున్న బీజేపీ మండలాధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి

అల్లవరం ఎంపీడీవోగా గౌరీకుమారి

అల్లవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిణిగా గౌరీకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కె.గంగవరం మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన గౌరీకుమారి పదోన్నతిపై అల్లవరం ఎంపీడీవోగా బదిలీపై వచ్చారు. ఎంపీడీవో గౌరీకుమారిని మండల బీజేపీ అధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి శాలువా కప్పి సత్కరించారు. వాసంశెట్టి కార్తీక్ పాల్గొన్నారు.

కేసు నమోదు

మలికిపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పడమటిపాలెం పంచాయతీలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న కందికట్ల రత్నకుమారిపై అదే గ్రామానికి చెందిన అడబాల లక్ష్మి, రేకపల్లి దొరబాబు, అడబాల వెంకటనాగసత్యవతి అనువారు కులం పేరుతో దూషించినట్టు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ధర్నాచౌక్‌లో విద్యుత్ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు



అమలాపురం ధర్నాచౌక్‌లో నిరాహార దీక్షలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి దశలవారీ ఆందోళనలో భాగంగా శుక్రవారం అమలాపురం నల్లవంతెన వద్ద ధర్నాచౌక్‌లో విద్యుత్ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ముఖ్య అతిథులుగా హాజరై జేఏసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ అంబటి రాజారత్నం, జేఏసీ చైర్మన్ మట్టపర్తి వెంకటరమణ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల యాజమాన్యం నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా ఆందోళనబాట పట్టామన్నారు. విద్యుత్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. పదేళ్ల సర్వీసు దాటిన వారందరికీ 2018 రివిజన్‌లో మంజూరుచేసిన సర్వీసు ఇన్సెంటివ్ పునరుద్ధరించాలన్నారు. దీర్ఘకాలిక సర్వీసు ఉన్న ప్రతీ ఒక్కరినీ విద్యుత్ సంస్థలలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, గతంలో మాదిరిగా కారుణ్య నియామకాలు చేపట్టాలని, బకాయి పడ్డ డీఏ, డీఆర్‌లు చెల్లించాలని, ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులర్ చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. నిరాహార దీక్షల్లో వివిధ యూనియన్ల నాయకులు వి.వెంకటేశ్వరరావు, కర్రి సుబ్బరాజు, గోవిందు, పిల్లి ప్రసాద్,వై.థామస్‌తో పాటు 42 మంది పాల్గొన్నారు. వివిధ యూనియన్ల నాయకులు సరెళ్ల సత్యనారాయణ, దంగేటి నరేంద్రకుమార్, వి.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ శెట్టి, రామచంద్రపురం డివిజన్ జేఏసీ చైర్మన్ అడపా వెంకట్, కన్వీనర్ వి.రాజ్‌కుమార్, వేగుళ్ల వీర్రాజు పాల్గొన్నారు.



అమలాపురం సబ్‌రిజిస్ట్రార్ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖర్ల సంఘ నాయకులు

పాతవిధానం కొనసాగించాలి

● దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

అమలాపురం టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఓటీపీలతో సంబంధం లేకుండా మాన్యువల్‌గా జరిగే పాత విధానాన్ని కొనసాగించి క్రయ విక్రయదారులకు న్యాయంచేయాలని కోరుతూ దస్తావేజు లేఖర్లు శుక్రవారం అమలాపురం సబ్‌రిజిస్ట్రార్ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ప్రైమ్ 2.0తో రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లో క్రయ విక్రయదారులకు జరుగుతున్న ఇబ్బందులతో దస్తావేజులేఖర్లు శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. విక్రయదారుల డేటా సబ్మిట్ చేసే సమయంలో ఓటీపీల్లో వస్తున్న ఇబ్బందులను సబ్‌రిజిస్ట్రార్‌కు వివరించారు. ఆధార్ ఓటీపీ రాకపోవడంతో క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దస్తావేజు లేఖర్లసంఘ గౌరవాధ్యక్షుడు గుంటు ఫణిప్రసాద్, అధ్యక్షుడు జిన్నూరి సురేష్, వెనుతురుపల్లి సుబ్బు, పందిరి హరి, గుమ్మళ్లనరేష్, దుర్గేష్, దస్తావేజు లేఖర్ల కన్వీనర్ మట్టపర్తి రాము, కడలి సత్యనారాయణ, సీహెచ్ వెంకట్రామయ్య, బొర్రా వెంకటేశ్వరరావు, యల్లమిల్లి బుజ్జి వినతిపత్రం అందజేసి జరుగుతున్న ఇబ్బందులను సబ్‌రిజిస్ట్రార్‌కు వివరిస్తూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని దస్తావేజు లేఖర్లు శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట వారంతా నిరసన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం రిజిస్ట్రేషన్ చేయించడం బంద్‌చేసి పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంత్రి ప్రగడ వెంకటకృష్ణారావు, చవటపల్లి వెంకటేశ్వరరావు, అయినాపురపు గోపాలకృష్ణ, తాడాల వీరభద్రరావు, యల్లాప్రగడ జన్నాథరావు, మంత్రిప్రగడ కృష్ణారావు, సలాది చిట్టిబాబు, నార్ని రామలింగ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాజోలు(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంఘం పిలుపు మేరకు రాజోలు దస్తావేజు లేఖర్లు శుక్రవారం పెన్‌డౌన్ నిర్వహించారు. రిజిస్ట్రేషన్ శాఖలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 రిజిస్ట్రేషన్ విధానంలో అనేక టెక్నికల్ ఎర్రర్స్ ఉన్నాయని తెలిపారు. శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు పెన్‌డౌన్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖర్లు కాశీభట్ల రాజగోపాలం, కడలి వెంకటరమణ, మంచిగంటి సత్తిబాబు, అడబాల ప్రభాకరరావు, దేవళ్ల బాలాజీ, మండేల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వేల నుంచి మినహాయింపు ఇవ్వాలి

● జేసీకి వినిపత్రం అందజేసిన సచివాలయ ఉద్యోగులు



జాయింట్ కలెక్టర్ నిషాంతికి వినతిపత్రం అందిస్తున్న బాపూజీ

అమలాపురంటౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తిరిగి సర్వేల నిర్వహణ నుంచి సచివాలయ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలన్న ప్రధాన డిమాండ్లతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయ నాయకుల బృందం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతిని కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, రికార్డు అసిస్టెంట్ కేడర్‌ను జూనియర్ అసిస్టెంట్ కేడర్‌గా మార్చాలని, అన్ని డిపార్టుమెంట్ల వారీగా పదోన్నతుల చానల్ ఏర్పాటుచేయాలని కోరుతూ బాపూజీ వినతిపత్రం అందించారు. తొలుత జరిగిన సమావేశంలో బాపూజీ మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ లేకపోవడంతో గ్రామస్థాయిలో క్లస్టర్‌లో జరిగే ప్రభుత్వ సర్వేలు సచివాలయ ఉద్యోగులతో చేయించడం ద్వారా వారు వెట్టిచాకిరీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సచివాలయ ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జేసీని కలిసిన వారిలో జిల్లా జేఏసీ నాయకులు కెఎన్ శశిధర్, జి.సుధాకర్, వి.సతీష్, కె.స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా యానాం రోడ్లు

● ఆర్‌ఏకు వినతిపత్రం అందజేత



ఆర్‌ఏ అంకిత్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న కనకాలరాజు

యానాం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ప్రధానరోడ్ల పరిస్థితిని చక్కదిద్దాలని యానాం బీజేపీశాఖ అధ్యక్షుడు కనకాలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు పరిపాలనాధికారి అంకిత్‌కుమార్‌కు వినతిప్రతం అందజేశారు. ముఖ్యంగా యానాం ప్రాంతంలోని గుంతలు పాడైపోయిన కొన్ని ప్రధాన రహదారులు పరిస్థితి చాలా అధ్వానంగా ఉందని వివరించారు. ఈరోడ్లను తక్షణమే పర్యవేక్షించి అత్యవసర మరమ్మతులు చేసే విధంగా ప్రజాపనులశాఖ అధికారులకు అదేశాలు జారీచేయాలని కోరారు. ముఖ్యంగా యానాం నల్లచెరువు నుంచి ద్రాక్షారామ బైపాస్ జంక్షన్ వరకు, కనకాలపేట గ్రామంలోని ఆది ఆంధ్రపేట ప్రధాన రహదారులు బాగాగుంతలు పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పరిపాలనాధికారి సానుకూలంగా స్పందించారని కనకాల రాజు తెలిపారు.

పుదుచ్చేరి వసతి గృహంలో యానాంకు అన్యాయం

పుదుచ్చేరిలోని ప్రభుత్వ అతిథి గృహం (యాత్రినివాస్)లో యానాం నుంచి వెళ్లే విద్యార్థులకు, ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని యానాం బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు ఆరోపించారు. ఈమేరకు యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు నామా గోపి, హరికృష్ణ, పుగాకు వాసు, దుర్గారావు పాల్గొన్నారు.

రూ.17కోట్ల వ్యాపార టర్నోవర్‌తో సహకార సొసైటీ



సమావేశంలో మాట్లాడుతున్న మెట్ల రమణబాబు

అల్లవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం మెట్ల రామమూర్తి వ్యవసాయ సహకార సొసైటీ రూ.17 కోట్ల ఎరువుల వ్యాపార టర్నోవర్‌తో లాభాల బాటలో నడుస్తోందని సొసైటీ చైర్‌పర్సన్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు అన్నారు. శుక్రవారం సొసైటీ మహాజన సభ జరిగింది. 105 ఏళ్లుగా సొసైటీ అభివృద్ధికి సహకరిస్తున్న సభ్యులకు రమణబాబు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శ సొసైటీగా తీర్చిదిద్దుతానన్నారు. సొసైటీ జమాఖర్చులు, అభివృద్ధి అంశాలను సీఈవో కొమ్మూరి సత్తిబాబు సభకు వివరించారు. సమావేశంలో కడలి శ్రీనివాసరావు, బళ్ల సత్యనారాయణ, మంతెన సురేష్‌రాజు, గునిశెట్టి చినబాబు, గుర్రం నరసింహమూర్తి, ఆకుల పురుషోత్తమ్, పులుసుగంటి ప్రసాదరావు, కముజు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కూళ్లలో ఉచిత మెగా పశు వైద్యశిబిరం


పశువులకు వైద్యపరీక్షలు చేస్తున్న ఏడీఏ

కె.గంగవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ వీర్యము ఉపయోగిపంచడం ద్వారా పాడి రైతులకు ఎంతో ఉపయోగమని కాకినాడకు చెందిన ఏపీ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఈవో డాక్టర్ కాంతారావు అన్నారు. శుక్రవారం కూళ్లలో సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా పశు వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎదకు వచ్చిన పశువులకు లింగ నిర్ధారణ వీర్యము వాడటం వల్ల ఖచ్చితంగా ఆడదూడలు పుడతాయని, తద్వారా రైతుకు ఉపయోగం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ రామచంద్రపురం ఏడీఏ ఓ. రామకృష్ణ, పశువైద్యులు ఎం.కృష్ణార్జున, ఏ. నాగశ్రావణి, ప్రసాద్, భావన, కళ్యాణి, గోపాలమిత్ర ఎం.శ్రీ నివాస్, గోపాలకృష్ణ, టీడీపీ నాయకులు చిట్టూరి రామ్మోహన్‌రావు, చిట్టూరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ప్రతిరైతు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ ఏడీఏ ఓ. రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన ఊడిమూడిలో టీకాలు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కోటిపల్లి పశువైద్యురాలు సంయుక్తలక్ష్మి ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది సేవలందించారు.సర్పంచ్ కోటిపల్లి సుబ్బారావు (చంటి), కూటమి నేతలు పాల్గొన్నారు.

'మహిళల ఆరోగ్యానికే స్వస్థ నారీ సశక్త్ అభియాన్'


ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, వైద్యసిబ్బంది

కె.గంగవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసమే కేంద్ర ప్రభుత్వం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ నిర్వహిస్తోందని పామర్రు వైద్యాధికారి వర్ధన్ అన్నారు. శుక్రవారం కూళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన స్థానిక ప్ర జా ప్రతినిధులు, వైద్యసిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, కూటమి నాయకుడు చిట్టూరి రామ్మోహన్‌రావు పాల్గొని మహిళలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్లి దుర్గాప్రసాద్, నీటిసంఘం డైరెక్టర్ చిట్టూరి సుబ్బారావు, పామర్రు ఆసుపత్రి వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే దంగేరులో డాక్టర్ అమన ఆధ్వర్యంలో వైద్యశిబిరం జరిగింది. గ్రామసర్పంచ్ కొప్పిశెట్టి వెంకట రమణ, కార్యదర్శి సత్యనారాయణ, కూటమి నాయకులు మేడిశెట్టి పుణ్యమూర్తి, దంగేటి నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మహిళల ఆరోగ్య రక్షణపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక సచివాలయం వద్ద నిర్వహించిన స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియా న్‌ను ఆయన ప్రారంభించారు. ఎంపీటీసీ శీలం భాస్కరరావు, కూటమి నాయకులు బలవరెడ్డి సత్తిబాబు, కొప్పిశెట్టి వాసు, నామాల శ్రీనివాస్, కేతిన చిన్న, చేపూరి నారాయణరావు, గ్రామ కార్యదర్శి కె. శివచక్రవర్తి, ఎంపీహెచ్ఈవో మల్లికార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామారావు, హెచ్ఎస్ నానిబాబు, హెచ్‌వీ మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.


కపిలేశ్వరపురంలో..

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం



రాయవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సేవా ట్రస్టు ద్వారా ప్రతి సంవత్సరం విద్యార్థులకు అందజేసే ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రస్టు ఛైర్మన్ దంతుర్తి సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి, మెరిట్ కలిగిన పేద బ్రాహ్మణ విద్యార్థులు ఈ ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 30వ తేదీ లోపు పూర్వపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా విద్యార్థులు మాత్రమే ఈ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుకు అర్హులని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 9849592523 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్సీ


మండపేట కళాజాతలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మండపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి కోరారు. వీరి సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్, ఉపాధ్యాయ రణభేరి కార్యక్రమం ఈనెల 15న తునిలో ప్రారంభమై శుక్రవారంతో నాల్గోరోజు మండపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు కళాజాతకు ఘన స్వాగతం పలికారు. యూటీఎఫ్ రాష్ట్ర నేతలు జ్యోతిబసు, చక్రవర్తి అరుణ కు మారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు సురేంద్రకుమార్, ఎంటీవీ సుబ్బారావు, పెంకే వెంకటేశ్వర రావు కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, డీవీ రాఘవులు, నియోజక వర్గానికి చెందిన టీచర్లు,యూటీఎఫ్ నేతలు పాల్గొన్నారు.

రెండోరోజూ వీఆర్‌ఏల ధర్నా


తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రెండోరోజైన శుక్రవారమూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులు పలివెల నాగేశ్వరరావు, ఏ. శివప్రసాద్, కార్యదర్శి కె. శ్రీనివాస్‌లు, తదితరులు మాట్లాడుతూ పేస్కేలు అమలు చేయాలన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో తమ డిమాండ్ల పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంజే బాబు, పీ. సూర్యప్రకాశరావు, టీ. నారాయణ రావు, వై. మోహనరావు, డీ. నిర్మల కుమారి, వై. మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

కోటిపల్లి వద్ద పెరిగిన గోదావరి ఉధృతి


ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

కె.గంగవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో కోటిపల్లి వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కోటిపల్లి పుష్కరాల రేవులో మెట్లు, ఫెర్రీరేవు వరదలో చిక్కుకున్నాయి.

విద్యార్థులు లక్ష్యానికి అనుగుణంగా చదవాలి

రాయవరం ఎంపీడీవో కీర్తి స్పందన


వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో

రాయవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటికి అనుగుణంగా చదవాలని ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన సూచించారు. శుక్రవారం వీఎస్ఆర్ రూరల్ కళాశాల ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. కార్యక్రమం ప్రొఫెసర్ మల్లిడి అమ్మిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. దీనికి ఎంపీడీవో హాజరై మాట్లాడుతూ విద్యార్థి దశలో డిగ్రీ కీలకమన్నారు. దీనిలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే చదువులో ప్రతిభ కనబర్చిన ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వీఎస్ఆర్ రూరల్ డిగ్రీ కళాశాల ఛైర్మన్ డాక్టర్ మల్లిడి శేషవేణి, ప్రిన్సిపాల్ ఎం.సతీష్‌రెడ్డి, విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. అచ్చిరెడ్డి, టి.సుబ్బిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మండపేటలో దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్


పెన్‌డౌన్ చేస్తున్న దస్తావేజు లేఖర్లు

మండపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పనిచేసే డాక్యుమెంట్ లేఖర్ల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని కోరుతూ లేఖర్లంతా శుక్రవారం పెన్‌డౌన్ బాట పట్టారు. మండపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్ర, శనివారం డాక్యుమెంట్ రైటర్లు సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్ర మంలో లేఖర్లు కొంపెల్ల శ్రీరామ చంద్రమూర్తి, డీ.శివ రామకృష్ణప్రసాద్, పీ.సురేష్ కుమార్, కొంపెల్ల చిన సత్యనారాయణమూర్తి, దుగ్గిరాల వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏడిద సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని రామచంద్రపురం విద్యుత్ శాఖ ఏఈఈ కే.రత్నాలరావు తెలిపారు. దీంతో ఏడిద, ఏడిద సావరంలో సరఫరా ఉండదన్నారు.

రాయవరం: చెల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ రామచంద్రపురం డీఈఈ కే.రత్నాలరావు తెలిపారు. శుక్రవారం డీఈఈ మాట్లాడుతూ అన్ని 11 కేవీ ఫీడర్లకు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు సరఫరా ఉండదన్నారు. అలాగే వి.సావరంలోనూ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరవాలి

ఆత్రేయపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల్లో జన సురక్ష కార్యక్రమం ద్వారా జీరో బ్యాలెన్స్ అకౌంట్లు తెరుచుకోవచ్చునని సొసైటీ ఛైర్‌పర్సన్ ముళ్ళపూడి వెంకటకృష్ణకిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం వద్దిపర్రు సొసైటీ వద్ద జనసురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

● కమిషనర్లకు మున్సిపల్ ఆర్డీ ఆదేశం


కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు

మండపేట, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాలో వున్న మున్సిపాల్టీలు, నగర పంచాయతీల్లో పేరుకుపోయిన పన్నులను సత్వరమే ఈనెలాఖరుకు వసూలు చేయాలని రాజహేంద్రవరం మున్సిపల్ ఆర్డీ సీహెచ్ నాగమల్లేశ్వరరావు కమిషనర్లను ఆదేశించారు. రెండు జిల్లాలకు సంబంధించిన మున్సిపాల్టీలు, నగర పంచాయతీల కమిషనర్లతో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు జిల్లాల్లో రూ. 19 కోట్ల మేర బకాయి ఉందని, దాన్ని ఈ నెలాఖరులోగా వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్ రాజేశ్వరరాజు, అమలాపురం కమిషనర్ నిర్మలాకుమార్, ముమ్మిడివరం మున్సిపల్ కమిషనర్ వర్మ, పిఠాపురం కమిషనర్ కనకారావు, సామర్లకోట కమిషనర్ శ్రీవిద్య, పెద్దాపురం మున్సిపల్ కమిషనర్, శ్రీకాంత్ రెడ్డితోపాటు మండపేట మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్, సత్తిరాజు, శాస్త్రి, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ


భానూజీని సన్మానిస్తున్న ఉద్యోగులు

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఎంపీడీవోగా ఎం. భానూజీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా రావికమతంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో జీ.రాజేంద్రప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో మోహన్, ఉద్యోగులు కలిశారు.

స్వస్థ నారీని సద్వినియోగం చేసుకోవాలి

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సుమలత

పలుచోట్ల వైద్య శిబిరాలు


సంధిపూడిలో స్వస్థ నారీ శక్త్ పరివార్ కార్యక్రమ దృశ్యం

ఆలమూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకం ప్రవేశపెట్టిన స్వస్థనారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమం నెల రోజుల పాటు అన్ని గ్రామాల్లో జరుగుతుందని, మహిళలు అందరు సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.సుమలత అన్నారు. ఆలమూరు మండలం సంధిపూడిలో శుక్రవారం ఈ కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. సర్పంచ్ తోట భవానీ, ఎంపీటీసీ తోలేటి సంతోషిల అధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో చిన్నారులకు టీకాలు అందించి, గర్భి ణీలు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు డి.సాయికిషోర్, లక్ష్మీస్నేహలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగలక్ష్మి, వరలక్ష్మి, అరుంధతి, నాయకులు దొడ్డా సుబ్బారావు, నల్లా వెంకన్న, సిద్దిరెడ్డి శ్రీనివాస్, వాసా కాశీ పాల్గొన్నారు.

కొత్తపేట: కొత్తపేట సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సీడీపీవో ఎ.జయలక్ష్మి, సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ము ఖ్యఅతిథులుగా విచ్చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి భాస్కరరావు, బీర ఇసాక్, దేవపాటి వెంకటేశ్వరరావు, మిద్దే ఆదినారాయణ, పాలూరి జయప్రకాశ్ నారాయణ, కోటిపల్లి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం ఏరుపల్లి, ద్రాక్షారామలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. ద్రాక్షారామలో 203 మందికి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో డాక్టర్లు రత్నసుధ, సందీప్‌నాయుడు, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మండలాధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, పెయ్యల రాంబాబు, హసన్‌బాద సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, సంపతి సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం మండలం ముమ్మిడివర్రాడు గ్రామంలో గోపాలపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వాతి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్థ నారీ స్వశక్తి పరివార్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మహిళలకు వచ్చే ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించే ప రీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రా మాల్లో 9 ఏళ్ల బాలికల నుంచి పెద్ద వయస్సు మహిళల వరకూ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


కొత్తపేటలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం


ముమ్మిడివర్రాడు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ స్వాతి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొత్తపేట, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సబ్‌స్టేషన్‌లో చేపడుతున్న మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ (ఆపరేషన్స్) రాంబాబు శుక్రవారం తెలిపారు. మండలంలో కొత్తపేట, మందపల్లి, కేదార్లంక, నారాయణలంక, వాడపాలెం, కొత్తపాలెం, అవిడి, కండ్రీగ, గంటి, పల్లిపాలెం గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

'ప్రతీ పోలీసుస్టేషన్‌లో కంప్లైంట్ బాక్సులు పెట్టాలి'

రావులపాలెం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి పోలీస్‌స్టేషన్ కార్యాలయం వద్ద కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయాలని పోలీసులు, ఇతర బాధితుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు, రావులపాలేనికి చెందిన మెర్ల శాస్త్రులు జిల్లా ఎస్పీ రాహుల్‌మీనాను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఏడాది క్రితం ఫోన్ నెంబర్లతో కూడిన బోర్డును ఏర్పాటు చేయాలని, ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని పేర్కొన్నారు. డీజీపీ ఉత్తర్వులు అనుసరించి త్వరలోనే కంప్లైంట్ బాక్సులు ఏర్పాటు చేయనున్నట్టు ఎస్పీ చెప్పారు.

ఆయుర్వేద జాతీయ సదస్సుకు ద్విభాష్యంకు ఆహ్వానం



ఆలమూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఈనెల 23న జాతీయ భారతీయ వైద్య పరంపర సంస్థ నిర్వహించనున్న జాతీయ సదస్సుకు మండలంలోని చింతలూరు వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం మేనేజింగ్ డైరెక్టర్ ద్విభాష్యం వెంకటశ్రీరామమూర్తికి ఆహ్వానం అందినట్టు ఆయన తెలిపారు. ఆయుర్వేద వైద్యంలో చేస్తున్న వినూత్న పరిశోధనలు, ఆయుర్వేదానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవకాశం లభించింది. దేశంలో జరుగుతున్న ఆయుర్వేద ఉత్పత్తులు, ఈ రంగ అభివృద్ధికి చేపట్టాలసిన అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నట్టు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వీఆర్‌ఏల నిరసన


ఆలమూరులో రిలే దీక్షలు చేస్తున్న వీఆర్‌ఏలు

రావులపాలెం/ఆలమూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యలు పరిష్కారించాలంటూ వీఆర్‌ఏలు రావులపాలెం తహశీల్దారు కార్యాలయం వద్ద చేపడుతున్న నిరసన దీక్ష రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు తెలంగాణా తరహాలో పేస్కేల్ వర్తింపజేయాలని, అర్హులైన వీఆర్ ఏలకు పదోన్నతి కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.కారుణ్య నియామకాలు కల్పించాలని, జీతాలు పెంపుదల చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. వీఆర్‌ఏల సంఘం మండలాధ్యక్షుడు దామోదరం పెద్ద సత్యనారాయణ,సెక్రటరీ మల్లేశ్వరపు వరప్రసాద్, నాయకులు పాల్గొన్నారు. ఆందోళనలో భాగంగా తదుపరి ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమా లు చేపట్టనున్నట్టు ఆలమూరు వీఆర్‌వోల సంఘం నాయకులు తాతపూడి ఇసాన్,కె.శివరామారావు, భువనగిరి ఏసు, జి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. తహశీల్దార్‌కి వినతిపత్రం అందించారు.

వెంకన్న ఆలయంలో చైర్మన్ వెంకట్రాజు పూజలు


చైర్మన్ వెంకట్రాజును అభినందిస్తున్న టీడీపీ శ్రేణులు

ఆత్రేయపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్‌గా ముదునూరి వెంకట్రాజు నియమిస్తూ ప్రభుత్వం ప్రకటించింది. 17 మంది ధర్మకర్తలను నియమించి ఉత్తర్వులు జారీచేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం వెంకట్రాజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఆయనను ఆలయ సిబ్బంది, అర్చకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే శ్రీనివాస మంగాపురం ప్రధానార్చకులు దివి బాలాజీ రంగాచార్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఇదిలా ఉండగా వెంకట్రాజును టీడీపీ నాయకులు ఆత్రేయపురంలో ఆయన స్వగృహానికి వెళ్లి అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీను, గుత్తుల రాంబాబు, కాసా సాగర్, పల్లి ఏసు, గనిశెట్టి వీరేష్, ఎం.ఆనందరావు, గుబ్బల మూర్తి పాల్గొన్నారు.

ఆర్థిక స్థోమత లేనివారికి ఉచిత న్యాయ సహాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ),సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్థిక స్థోమత లేని రిమాండు ఖైదీలకు ఉచిత న్యాయసహాయం అందిస్తామని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ తెలిపారు. శుక్రవారం ఆమె రామచంద్రపురం సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండు ఖైదీలకు అందుతున్న ఆహార పదార్థాలు, తాగునీరు సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సబ్‌జైళ్ల అధికారి ఎల్.రంగస్వామి, రామచంద్రపురం సబ్ జైలు సూపరిండెంట్ కె.వెంకటేశ్వరరావు, న్యాయవాది పి.వి.ఎస్.జానకి, లోక్ అదాలత్‌సిబ్బంది సుబాషిణి, పేరా లీగల్ వలంటీర్ ఎం.జ్యోత్స్న దేవి పాల్గొన్నారు.

జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరవాలి


వద్దిపర్రులో జనసురక్ష సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల్లో జనసురక్ష కార్యక్రమం ద్వారా జీరో బ్యాలెన్స్ అకౌంట్లు నిర్వహించుకోవచ్చునని సొసైటీ ఛైర్మన్ ముళ్లపూడి వెంకటకృష్ణ కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం వద్దిపర్రు సొసైటీ వద్ద జనసురక్ష అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధాన మంత్రి జనధన్ ఖాతాలు జీవన జ్యోతి సురక్ష బీమా, అటల్ పెన్షన్, పసల్ బీమా వంటి పథకాలు ప్రవేశపెట్టారని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.పంటలకు సంబంధించి రుణాల మంజూరు, డిపాజిట్ల సేకరణ, తదితర కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముళ్లపూడి భాస్కరరావు, జుజ్జవరపు శ్రీహరి, బ్యాంకు మేనేజర్ సూసన్, సూపర్‌వైజర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాఠశాలకు ఉపకరణాలు



ఆత్రేయపురం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వద్దిపర్రు ఎంపీపీ పాఠశాలలో ఐడీబీఐ బ్యాంకు రూ.1.05 లక్షల విలువైన ఆర్వో ప్లాంటు, బీరువాలు, టేబుల్స్, కూర్చీలు, తదితర సామగ్రి హెచ్‌ఎం పార్వతీకి అందించారు. బ్యాంకు మేనేజర్లు ప్రణవ్‌కుమార్, షణ్ముఖ్, భారత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్రవైద్య శిబిరం


విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామచంద్రపురం(ద్రాక్షారామ),సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో ఎస్ఎస్ఎస్ యూనిట్ల సౌజన్యంతో కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 700 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు జరిపారు. పలువురు విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. 25 మందికి మెరుగైన వైద్యం నిమిత్తం కిరణ్ కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీ రావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు జి.మాణిక్యం, ఎ.శ్రీనివాస్, ఎన్.సుధాకర్, బి.మల్లికార్జునరావు, కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల సమస్యలు పరిష్కరించాలి



రావులపాలెం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా రావులపాలెం సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పార్టీషన్, హక్కు విడుదల దస్తావేజులు, వ్యవసాయ భూములకు ఆటో మ్యూటేషన్ సక్రమంగా జరిగేటట్టు చూడాలి. ప్రైవేట్ అటెండెన్స్ సులభంగా పాత పద్ధతిలో జరిగేలా చూడాలి. ఎన్ఆర్ఐలకు పాస్‌పోర్టుతో కూడా రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని తదితర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌రిజిస్ట్రార్‌కు అందజేశారు.

కొమానపల్లిలో స్వచ్ఛత పక్వాడ్

ముమ్మిడివరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొమానపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, పాఠశాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈవోలు టి.గౌరీశంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విత్తనాల శ్రీనివాసరావు, ఎస్.రాంబాబు, కేఎస్వీ త్రిమూర్తులు, ఎస్ఎన్ మునేశ్వరరావు, ఆర్.నాగార్జున, ఎన్‌డీవీవీ ప్రసాద్, సాధనాల శ్రీనివాసరావు, పి.సత్యనారాయణమ్మ, పి.వికాశిని పాల్గొన్నారు.